క్లుప్తంగా

విద్యార్థులకు పోటీలు

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో ఫిబ్రవరి ఒకటో తేదీన విద్యార్థులకు అచ్యుతాష్టకం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ కంఠస్థ పఠన పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ జె.శ్యామ్‌సుందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారంతా 9441461076 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అక్కినేనికి ఘన నివాళులు

విజయనగరం టౌన్: నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు తొమ్మిదో వర్ధంతిని ఆదివారం స్థానిక కోట జంక్షన్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎన్ఆర్ అభిమాని కుంటుభుక్త దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, నటనకు భాష్యం చెప్పిన మహానటుడు అక్కినేని అని కొనియాడారు. కార్యక్రమంలో ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు దుర్గాప్రసాద్, దారా వెంకట్, అంకం కిరణ్, రాధాకృష్ణారెడ్డి, అంజి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పసపాం విద్యార్థి ప్రతిభ


రాష్ట్రస్థాయి పోటీలలో విజేతగా నిలిచిన లక్ష్మి

పూసపాటిరేగ: మండలంలోని పసపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.లక్ష్మి 66వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో విజేతగా నిలిచింది. ఈ నెల 21, 22 తేదీలలో శ్రీకాకుళం గవర్నమెంట్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో జరిగిన క్రీడా పోటీలలో అండర్-14 విభాగం హైజంప్‌లో లక్ష్మి తృతీయ స్థానంలో నిలిచింది. దీంతో విద్యార్థినిని హెచ్ఎం ఐ.రాజేశ్వరరావు, పీఈటీ లీలాకృష్ణ, తదితరులు అభినందించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

భోగాపురం: మండలంలోని మరడపాలెం, చేపలకంచేరు, రెడ్డికంచేరు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కొండపు వెంకటకొత్తయ్య, అరజర్ల సోములు, శీరపు దుర్గారావు అనే ముగ్గురు వ్యక్తులను ఎస్సై కృష్ణమూర్తి, ఏఎస్సై పి. తవుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, నిందితులు కొంత కాలంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మాటు వేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల నుంచి 49 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సూర్యనారాయణస్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యనారాయణస్వామి

విజయనగరం టౌన్: మాఘమాసం తొలి ఆదివారాన్ని పురస్కరించుకుని బాబామెట్ట ఏడుకోవెళ్లలో కొలువైన సూర్యనారాయణస్వామికి ఆలయ అర్చకుడు పేరి సూర్యతేజ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కేపీపీ రాజు, కార్యదర్శి శివకుమార్, కోశాధికారి సాంబమూర్తి రాజు, జామి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

భోగాపురం: మండలంలోని తోటపల్లి బస్టాప్ వద్ద ఎస్సై కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో రామచంద్రపేట ఉప్పుగెడ్డ నది నుంచి భోగాపురం వైపు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, తదితరులు

నెల్లిమర్ల: మాలమహానాడు ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్లను పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ, మాలలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు తీసివేయాలని కొన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేయడం దారుణమన్నారు. హక్కుల పోరాటానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు టి. నారాయణరావు, డి. అప్పారావు, కె. వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకో పార్క్..


ప్రకాశం పార్కు ముఖద్వారం


చిన్నారులకు ఊయలలు, జారుడు బల్ల


కనువిందు చేస్తున్న పూలమొక్కలు


మహిళలకు వ్యాయామ పరికరాలు


కనువిందు చేసే వాటర్ ఫౌంటేన్

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మహిళల కోసం నగరంలో ఓ పార్క్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కుల అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కేవలం మహిళల కోసమే ప్రకాశం పార్క్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న పార్క్ రంగరంగు పూలమొక్కలతో కనువిందు చేస్తోంది. అలాగే వాకింగ్ ట్రాక్, ఎక్సర్‌సైజ్ పరికరాలు, చిన్నారులకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

విద్యారంగానికి పెద్దపీట

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


అదనపు తరగతుల భవన నిర్మాణాలను శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మనబడి నాడు – నేడు ఫేజ్ -2లో భాగంగా మండలంలోని అమటాం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఐదు అదనపు భవనాలకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డితో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాదీవెన, జగనన్న అమ్మఒడి, జగనన్న, వసతిదీవెన వంటి పథకాలను ప్రవేశపెట్టి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, పడాల భాను, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, పట్నా తాతయ్యలు, దాట్ల శ్రీనురాజు, ఉప సర్పంచ్ నడుపూరి సత్యనారాయణ నాయుడు, ఎ.రమణ, జీరు గోపి, పి.పైడిరాజు, నారు సాయికుమార్, దల్లి లక్ష్మి, హెచ్ఎం సత్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్లు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● జిల్లా సైనిక సంక్షేమ అధికారి కృష్ణారావు


రక్తదానం చేస్తున్న రక్తదాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు సుభాస్ చంద్రబోస్ 126వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని చెప్పారు. అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

పూసపాటిరేగ: కొప్పెర్ల సర్పంచ్ పైడి వెంకటరమణ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, తదితరులు ఆదివారం గ్రామానికి చేరుకుని వెంకటరమణ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పి.లక్ష్మీనారాయణ, దాడిశెట్టి త్రినాథరావుతో పాటు పలువురు ఉన్నారు.

నరసింహం మాస్టారు సేవలు మరువలేనివి


నరసింహం మాస్టారు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

విజయనగరం ఫూల్‌బాగ్: ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, ఆపస్ వ్యవస్థాపక సభ్యుడు యూఏ నరసింహం మాస్టారు సేవలు మరువలేనివని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు ఇజ్జిరోతు రామునాయుడు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విజ్ఞానభారతి ఉన్నత పాఠశాలలో నరసింహం మాస్టారు సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి ఎస్. శ్రీనివాసరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు వీవీ శ్రీహరి, మాజీ డీఈఓ వీవీ నాగభూషణం పాల్గొన్నారు.

జీఎంఆర్‌ను కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు


గ్రంథి మల్లికార్జునరావును సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ప్రముఖ పారిశ్రామికవేత్త జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ గ్రంధి మల్లికార్జునరావును విజయనగరం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీ సభ్యులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన విజయనగరం వాణిజ్య సంస్థలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. యువ వ్యాపారవేత్తలకు పలు సూచనలు చేశారు. విజయనగరానికి చేరువలో రాబోతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వల్ల వ్యాపార రంగానికి నూతన అవకాశాలు వస్తాయయని జీఎంఆర్ అభిప్రాయపడ్డారు. మల్లికార్జునరావును కలిసిన వారిలో చాంబర్ నూతన అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, పూర్వ అధ్యక్షుడు ఉసిరికల చంద్రశేఖరరావు, ఎస్‌వీఎన్ హోటల్ అధినేత శివకుమార్, ఏఎస్ జూట్‌మిల్స్ డైరెక్టర్ పచ్చిగుల రామారావు, హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారుతి శ్రీనివాస్, యునైటెడ్ శ్రీనివాస్, అనిష్, నటరాజ్, ఉడత్తు రాజేష్, తదితరులున్నారు.

కార్టూన్ పోటీల్లో టీచర్‌కు బహుమతి



మొదటి బహుమతి సాధించిన రామచంద్ర గీసిన చిత్రం

కొత్తవలస : ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సాహిత్య విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ కార్టూన్ పోటీల్లో కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రామచంద్రకు బహుమతి వరించింది. ఈయన గీసిన 'తల్లి అనే పదానికి కనీసం ఒక పర్యాయ పదం చెబితే ఈ జాబ్ నీదే' అనే వంగ్య చిత్రానికి మొదటి బమమతి వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు విజయవాడలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ హైకోర్టు న్యాయమూర్తి ఎ.దుర్గాప్రసాద్, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, తానా నిర్వహకులు చేతుల మీదుగా నగదు బహుమతితో పాటూ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ మేరకు పాఠశాల భోధనా సిబ్బంది రామచంద్రను అభినందించారు.

పదిహేనేళ్ల తర్వాత కారుణ్య నియామకం..

విజయనగరం టౌన్: పదిహేనేళ్ల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో కుటుంబాన్ని కోల్పోయిన చిన్నారికి ఎట్టకేలకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం లభించింది. వివరాల్లోకి వెళితే.. విజయనగరానికి చెందిన సుంకరి వెంకట అప్పారావు రక్షణ రంగంలో ఉద్యోగం చేసేవారు. ఆయన భార్య వెంకటలక్ష్మి , కుమార్తె, కుమారుడుతో కలిసి విశాఖలో డిఫెన్స్ కాలనీలో ఉండేవారు. 2007 డిసెంబర్ 23న విశాఖ నుంచి విజయనగరం కారులో వస్తుండగా... బోయపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడు వినయ్‌కుమార్ తప్ప మిగిలిన ముగ్గురూ మృత్యువాత పడ్డారు. అనంతరం నానమ్మ సంరక్షణలో వినయ్ కొంతకాలం పెరిగాడు. ఆమె కాలం చేసిన తర్వాత చిన్నాన్న, పిన్ని వద్ద పెరిగిన వినయ్‌కుమార్‌కు కారుణ్య నియామకం కింద ఈ నెల 18న విశాఖ షిప్ బిల్డింగ్‌సెంటర్‌లో ఉద్యోగం వచ్చింది.

విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రిన్సిపాల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి

లక్కవరపుకోట: రేగ పంచాయతీ పరిధిలో సబల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ విదేశాలకు చిరుధాన్యాల ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని మార్కెటింగ్ అండ్ ఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీ ప్రిన్సిపాల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి ఆకాంక్షించారు. చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల చెల్లెల్ల సంఘంతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఇంతమంది చెల్లెల్లు కలిసి ఒక సంఘంగా ఏర్పాటు కావడం, ఇంత పెద్ద ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించుకోవడం అభినందించదగ్గ విషయమని, మహిళలందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. యూనిట్ నిర్వహణకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకాలు పూర్తిస్థాయిలో అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా మార్కెటింగ్ జెడీ ప్రసాద్ మాట్లాడుతూ మంచి ఉత్పత్తులు అందించి మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. సబల స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కె.సరస్వతి తమ సంస్థ ద్వారా చిరుధాన్యాల సాగుకు అందిస్తున్న ప్రోత్సాహం, తయారు చేస్తున్న ఉత్పత్తులు, సంఘం వ్యాపార లావాదేవీలను వివరించారు. కార్యక్రమంలో విశాఖపట్నం డీసీబీసీ సీఈఓ వర్మ, మార్కెటింగ్ ఏడీఏ శ్యామ్, సబల స్వచ్ఛంద సంస్థ వైస్ ప్రెసిడెంట్ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మల్యాడ


విజేతలతో నిర్వాహకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి. పది రోజుల నుంచి జరుగుతున్న ఈ టోర్నీలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి 25 క్రికెట్ జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో తరిమి, మల్యాడ జట్లు తుదిపోరుకు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తరిమి క్రికెట్ జట్టుపై మల్యాడ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పప్పల బలరాం, యువత పాల్గొన్నారు.

దళితవాడ పంచాయతీ సాధన దిశగా కృషి

చీపురుపల్లిరూరల్: దళితవాడ పంచాయతీ సాధన దిశగా అంబేడ్కర్ ఇండియా మిషన్(ఎయిమ్) కృషి చేస్తోందని ఆ సంస్థ జిల్లా ఇన్‌చార్జి అద్దూరి సీతబాబు, జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు అన్నారు. మండలంలోని పెదనడిపల్లి దళితవాడలో ఎయిమ్ సంస్థ ఆధ్వర్యంలో ' మన వాడ- మన పంచాయతీ, మన పాలన ' అనే అంశంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేస్తేనే దళిత ప్రజలు అభివృద్ధి చెందుతారన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల సాధనే ఎయిమ్ లక్ష్యమన్నారు. దళితులు ఐకమత్యంతో ఉండి హక్కులను కాపాడుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సర్పంచ్ ఎస్.పోలిరాజు,ఎంపీటీసీ ఆర్.నారాయణరావు, గుర్ల,మెరకముడిదాం మండలాల ఎయిమ్స్ కన్వీనర్లు టి.నారాయణప్పడు, సిర్లి రాము, పొట్నూరు రామన్న పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన ఏపీఎస్ఈబీ ఏఎం అద్దూరి సీతబాబు రూ.51,116 విరాళం ఇచ్చారు. ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు గంట్యాడ విష్ణు, ఎస్.వి.జి. శ్రీనివాసరావు, దాసరి రవి, ఆదిబాబుకు కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం నగదు అందజేశారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి తీర్థం


కొత్తవలస: పూజలందుకుంటున్న శ్రీ సీతారామలక్ష్మణులు

కొత్తవలస: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు. తీర్థం సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ట్రాఫిక్, ఇతర ఇంబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు ప్రదర్శన

వేపాడ: మండలంలోని రాయుడుపేటలో గ్రామ దేవత బంగారమ్మతల్లి తీర్థమహోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా ఉల్లాసంగా సాగింది. ఎడ్ల పరుగు ప్రదర్శనలో విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 15జతల ఎద్దులు పాల్గొన్నాయి. వావిలపాడుకు చెందిన గండివెంకటరావు ఎద్దు మొదటి స్థానంలో, ద్వితీయ స్థానంలో వల్లంపూడికి చెందిన శానాపతినాయుడు ఎద్దు తృతీయ స్థానంలో వల్లంపూడికి చెందిన బండి నాయుడు ఎద్దు నిలిచి వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేల నగదు బహుమతిని గెలుచుకున్నాయి. తర్వాత వరుస స్థానాల్లో నిలిచిన ఎద్దులకు రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలును ఆయా ఎద్దుల యజమానులకు గ్రామపెద్దలు అందజేశారు. తీర్థం సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

24,25వ తేదీల్లో సాంబమూర్తి తీర్థం

వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామంలో సాంబమూర్తి ఆలయం వద్ద ఈ నెల 24, 25వ తేదీల్లో తీర్థమహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా 24న రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం పారిశుద్ధ్య కార్మికులకు సన్మానంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 25న ఎడ్ల పరుగు ప్రదర్శన, అలాగే సైకిల్, బైక్‌స్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.


కొత్తవలస: కోలాటం ఆడుతున్న మహిళలు